ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
జనగామ
ఆదివారం 4 ఫిబ్రవరి 2024

'కారు'లో కుదుపు

- త్వరలో కాంగ్రెస్ గూటికి చేరే అవకాశం
- ఇప్పటికే దామోదర, పొంగులేటితో చర్చలు
- లోక్‌సభ ఎన్నికల వేళ గులాబీ పార్టీకి భారీ ఝలక్

బీఆర్ఎస్‌కు ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రాజీనామా







జనగామ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఆయన శనివారం లేఖ రాశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ స్థానం నుంచి టికెట్ ఆశించి భంగపడిన రాజయ్య కొంతకాలంగా పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. 'దళితబంధు' లబ్ధిదారుల నుంచి కమీషన్ల వసూలు, జానకీపురం సర్పంచి నవ్య చేసిన లైంగిక ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజయ్యను కాదని కడియం శ్రీహరికి టికెట్ ఇచ్చారు. దీంతో ఆయన బహిరంగంగానే కడియం శ్రీహరిపై, పార్టీపై ఆరోపణలు చేస్తూ వచ్చారు. 'అంతా తయారు చేసుకున్న వడ్ల రాశిపై ఎవరో వచ్చి కూర్చుంటానంటే ఊరుకుంటానా' అంటూ అప్పట్లో వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయనను బుజ్జగించే ప్రయత్నంలో భాగంగా రాజయ్యకు రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్ష పదవిని ఇచ్చారు. టికెట్ దక్కకపోగా రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కిందని సంతోషించే లోపే బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. దీంతో ఓ వైపు పార్టీ అధికారాన్ని కోల్పోవడం, మరోవైపు పార్టీలో సరైన ప్రాధాన్యత దక్కకపోవడంతో కొంతకాలంగా ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇదే క్రమంలో రాజయ్య వర్గానికి చెందిన కొందరు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కాగా.. కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు నిశ్చయించుకొనే ఆయన వర్గాన్ని కాంగ్రెస్‌లోకి ముందుగానే పంపారనే ప్రచారం జరుగుతోంది.

గత సెప్టెంబరులోనే చర్చలు

కాంగ్రెస్‌లో చేరేందుకు గత ఏడాది సెప్టెంబరులోనే రాజయ్య సిద్ధమయ్యారు. స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్‌ను శ్రీహరికి ఖరారు చేయడంతో అసంతృప్తికి లోనైన రాజయ్య కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా అప్పట్లో పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలతోనూ ఆయన చర్చలు జరిపారు. గత ఏడాది సెప్టెంబరు 4న హనుమకొండలో జరిగిన దళిత మేధావుల సదస్సుకు హాజరైన కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రస్తుత మంత్రి దామోదర రాజనర్సింహతో ఓ హోటల్‌లో రాజయ్య రహస్యంగా సమావేశమయ్యారు. ఇది అప్పట్లో చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్టీలో చేరతానని అప్పట్లో రాజనర్సింహ వద్ద ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన బీఆర్ఎస్ పార్టీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని రాజయ్య వద్దకు బుజ్జగింపులకు పంపింది. రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తామని చెప్పడంతో రాజయ్య అప్పట్లో కొంత వెనక్కి తగ్గారు. కాగా.. ఆయనకు సెప్టెంబరు 22న రైతుబంధు సమితి పదవి ఇవ్వడంతో కాస్త వెనక్కి తగ్గినట్టు కనిపించారు. కాగా.. టికెట్ రాకపోవడంతో ఆయన బీఆర్ఎస్ తరఫున ఎన్నికల ప్రచారంలోనూ పెద్దగా పాల్గొనలేదు. కడియం శ్రీహరి తరఫున ప్రచారం చేయకపోగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాగా.. టికెట్ దక్కకపోవడం, బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడం, సొంత పార్టీలోనే ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పొసగకపోవడంతో కాంగ్రెస్‌లో చేరడమే మంచిదని రాజయ్య భావించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, టీడీపీ నుంచి రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న కడియం, రాజయ్య ఒకే పార్టీలోకి రావడంతో ఆధిపత్య పోరు ప్రారంభం అయింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న తాటికొండ రాజయ్య ఉద్యమ సమయంలో 2011లో టీఆర్ఎస్‌లో చేరగా టీడీపీ నుంచి 2013లో కడియం శ్రీహరి టీఆర్ఎస్‌లో చేరి 2014లో వరంగల్ ఎంపీగా గెలిచారు. అనంతరం 2015లో ఎమ్మెల్సీగా అవకాశం రావడంతో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్సీగా 2021 నవంబరులో పదవీకాలం ముగియడంతో మరోసారి ఎమ్మెల్సీగా కడియం శ్రీహరికి అవకాశం ఇచ్చారు. దీంతో అప్పటి నుంచి ఇద్దరి మధ్య వైరం బాగా పెరిగి వ్యక్తిగత దూషణల వరకు వెళ్లింది.

13 ఏళ్ల అనుబంధంతో తెగదెంపులు

అప్పటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్‌తో ఉన్న 13 ఏళ్ల అనుబంధంతో తాటికొండ రాజయ్య తెగదెంపులు చేసుకున్నారు. 2009లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున రాజయ్య ఎమ్మెల్యేగా గెలిచారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీని వీడి అప్పటి టీఆర్ఎస్‌లో 2011లో చేరారు. అదే సమయంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా 2012 లో జరిగిన ఉప ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, వైద్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి, వైద్యశాఖ మంత్రి పదవిని పోగొట్టుకున్నారు. అనంతరం 2018లో జరిగిన ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా.. ఇటీవల ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో బీఆర్ఎస్ పార్టీతో ఉన్న 13 ఏళ్ల అనుబంధాన్ని తెంచేసుకొని సొంతగూటికి చేరనున్నారు. కాగా.. ఈనెల 10న ఆయన కాంగ్రెస్ పార్టీ తీర్థం తీసుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహతో భేటీ అయినట్లు తెలుస్తోంది.

తీవ్ర అసంతృప్తితో వీడుతున్నా: తాటికొండ రాజయ్య

బీఆర్ఎస్‌పై తీవ్ర అసంతృప్తితోనే పార్టీని వీడుతున్నానని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. హనుమకొండలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్‌లో చేరానని అన్నారు. తాను బతికి ఉన్నంత కాలం బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని, కానీ తనను పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చాలా రోజులుగా తీవ్ర మానసిక సంఘర్షణకు గురవుతున్నానన్నారు. తాను గతంలో కాంగ్రెస్ గూటి పక్షినే నని, తనకు కాంగ్రెస్ నాయకులతో మంచి సంబంధాలున్నాయని అన్నారు. పార్టీలో ఒక్కొక్కటిగా పదవులు వచ్చి పోతున్నాయని, అయినప్పటికీ తాను పార్టీకి విధేయుడిగానే ఉన్నానని తెలిపారు. విధేయతకు కూడా ఒక లిమిట్ ఉంటుందని, లిమిట్ దాటాక కూడా పార్టీలో ఉంటే పిచ్చోడిలా చూస్తారని అన్నారు. అందువల్లే త్వరలోనే తన అనుచరులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటానని అన్నారు.

అన్నదాతలే దేశానికి ఆధారం

హైకోర్టు జడ్జి శ్రీనివాసరావు

బమ్మెరలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సందర్శన



బమ్మెరలో పోతన సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

పాలకుర్తి, ఫిబ్రవరి 3: అన్నదాతల శ్రమపైనే దేశం ఆధారపడి ఉందని తెలంగాణ హైకోర్టు జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు ఆధ్వర్యంలో దేశంలోనే మొదటిసారిగా పోతన జన్మించిన ఊరిలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. ఈ న్యాయ సంస్థ ధరణి సమస్యలను ఏవిధంగా పరిష్కరించవచ్చో సూచనలు ఇస్తుందని, రైతులకు చట్టాలపై అవగాహన కల్పిస్తుందని అన్నారు. గ్రామాల్లో రైతులందరినీ ఒకే వేదికపై తీసుకురావడానికి ఈ సంస్థ ఉపయోగపడుతుందని అన్నారు. రైతు లేనిదే దేశం లేదని, ఎంత డబ్బు ఉన్నా రైతు పండించిన పంటపైనే దేశ ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని స్పష్టం చేశారు. అలాంటి రైతుకు ఏ చిన్న సమస్య వచ్చినా తమ సంస్థ తోడ్పాటునందిస్తుందని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో జిల్లా జడ్జి రవీంద్రశర్మతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో న్యాయమూర్తి విక్రం, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ వెంకటేశ్, అగ్రి క్లినిక్ నిర్వాహకుడు కన్నయ్య, జిల్లా కోర్టు సూపరిండెంట్ సీతారామరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కార్యదర్శి రాజు, మాజీ సర్పంచు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పోతన సమాధిని సందర్శించడం నా అదృష్టం..

భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన పుట్టిన గ్రామాన్ని సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని హైకోర్టు జడ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన తొలుత పాలకుర్తి శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. అధికారులు, పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బమ్మెరలో పోతన సమాధిని సందర్శించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతం గొప్ప కవులకు నిలయమని అన్నారు. పాల్కూరికి సోమనాథుడు, వాల్మీకి, పోతన లాంటి గొప్ప కవులు జన్మించారని అన్నారు. ముఖ్యంగా బమ్మెర పోతన తెలంగాణలో జన్మించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు.

భూదానం అభినందనీయం

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే పల్లా



భూదాన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బండా ప్రకాశ్, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి కోసం రూ.లక్షల్లో పలుకుతున్న భూమిని దానం చేయడం అభినందనీయమని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం వెంకిర్యాల మాజీ సర్పంచి కీర్తి లక్ష్మీనర్సయ్య తన తల్లితండ్రులు వెంకట్రామయ్య-రుక్మమ్మ జ్ఞాపకార్థం గ్రామంలోని రెండెకరాల భూమిని గ్రామానికి శనివారం దానం చేశారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. లక్ష్మీనర్సయ్య నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. భూముల కోసం రక్తసంబంధీకుల మధ్యే గొడవలు జరుగుతున్న ఈ సమయంలో సుమారు రూ. కోటి విలువ చేసే భూమి ఇచ్చి తన ఉదారతను చాటుకున్నారన్నారు. గ్రామాభివృద్ధి కోసం కుటుంబ సభ్యులంతా కలిసి దానం చేయడం మంచి పరిణామమన్నారు. దానం చేసిన స్థలంలో రెండుమూడు నెలల్లోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ప్రస్తుత సమాజంలో భూదానాలు తగ్గిపోయాయని, ఇలాంటివి ప్రోత్సహించాలని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం తన నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని బండా ప్రకాశ్ హామీ ఇచ్చారు. కాగా.. తనకున్న పరిచయాలతో నియోజకవర్గానికి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తన నీలిమ హాస్పిటల్‌లో ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా భూమి దానం చేసిన లక్ష్మీనర్సయ్యను, ఆయన కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జనగామ ఆర్డీవో మురళీకృష్ణ, కీర్తి వీరేందర్, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, నాయకులు పసుల ఏబెల్, బండ లక్ష్మి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

పౌరులు బాధ్యతగా పన్నులు చెల్లించాలి

జనగామ టౌన్, ఫిబ్రవరి 3: పట్టణ పౌరులు బాధ్యతగా ఇంటి, నల్లా పన్నులు చెల్లించాలని అడిషనల్ కలెక్టర్ పర్మర్ పింకేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో పన్నుల వసూలుపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పట్టణంలో ఇప్పటివరకు 32 శాతం పన్నులు వసూలయ్యాయయని తెలిపారు. ట్రేడ్ లైసెన్సు వ్యాపారులకు అవగాహన కల్పించి ప్రతీ ఒక్కరు సకాలంలో పన్నులు చెల్లించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మునిసిపల్ కమిషనర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్

ఎవరి దగ్గరా రూపాయి తీసుకోలేదు

జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దళిత బంధు పేరుతో ఎవరి దగ్గర ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఉద్దేశపూర్వకంగానే అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా పోటీ చేసే సమయంలోనూ ఇలాంటి ఆరోపణలు వచ్చాయని గుర్తు చేశారు. తనకు పార్టీ ఎంపీ టికెట్ ఇవ్వబోతోందనే సంకేతాలతో కొందరు కావాలనే తనపై కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

ఉద్యమ సమయంలో తన భూములు అమ్మి పార్టీకి సేవ చేశానని, ఆ భూముల విలువ ప్రస్తుతం రూ. వేల కోట్లలో ఉంటుందని అన్నారు. పార్టీ కోసం రూ. కోట్లు ఖర్చు పెట్టిన తాను దళితుల దగ్గర రూ. 62 లక్షలు తీసుకున్నానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 8 మండలాల్లో లేని ఆరోపణలు కేవలం మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లోనే ఎందుకు వస్తున్నాయో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచన చేయాలన్నారు. తనపై ఆరోపణలు చేసిన బద్దిపడగ కృష్ణారెడ్డే దళితుల నుంచి డబ్బులు వసూలు చేసుకున్నారని, ఈ విషయంపై గతంలో ఆ రెండు మండలాలకు చెందిన నేతలు ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారని గుర్తు చేశారు. దళితుల దగ్గర తీసుకున్న డబ్బులను కృష్ణారెడ్డి వెంటనే తిరిగి ఇవ్వాలని అన్నారు.

సీఐల బదిలీలకు రంగం సిద్ధం

- కమిషనరేట్ పరిధిలో భారీగా స్థానచలనాలు
- సిఫారసు లెటర్ పొందిన వారికే పోస్టింగ్?

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 3: వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పోలీసు అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి కమిషనరేట్ పరిధిలో పెద్దగా బదిలీలు జరగలేదు. ఒక్క ఇంతెజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ తప్ప.. ఎక్కడా బదిలీలు, పోస్టింగ్‌లు జరుగలేదు. ఇప్పటివరకు పనిచేస్తున్న అధికారులంతా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పోస్టింగ్‌లు పొందిన వారే. అయితే కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సీఐల బదిలీలు, పోస్టింగ్‌లు చేస్తున్నట్లు తెలిసింది.

20 ఠాణాల్లో..

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని 45 లా అండ్ ఆర్డర్, 3 ట్రాఫిక్, 2 మహిళా పీఎస్‌లు, 1 షీటీమ్, 1 భరోసా ఠాణాలతో పాటు టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక విభాగం ఉంది. ఈ మేరకు మొదటి విడతగా 20 పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న ఎస్‌హెచ్‌వోలను బదిలీ చేసేందుకు పోలీసు శాఖ రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అదే విధంగా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న 13 మందికి కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు పోస్టింగ్ లెటర్స్ రెడీ చేసినట్లు తెలిసింది. సోమవారం సీఐల పోస్టింగ్‌ల ఆర్డర్లు బయటకు వచ్చే అవకాశాలున్నాయి. కొందరి బదిలీలను సీపీ అంబర్ కిశోర్ ఝా చేస్తుండగా, మరికొందరి బదిలీలు, పోస్టింగ్‌లు మల్టీజోన్ ఐజీ కార్యాలయం నుంచి జరిగే అవకాశాలున్నాయి.

మళ్లీ పాత పద్ధతేనా?

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో జరగబోయే పోలీసు పోస్టింగ్‌లలో మళ్లీ పాత పద్ధతి (సిఫారసు లెటర్)నే అవలంబిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గత ప్రభుత్వంలో పోస్టింగ్ పొందాలంటే స్థానిక ఎమ్మెల్యే లెటర్ ఇస్తే సరిపోయేది. కానీ ప్రభుత్వం మారడంతో కొత్త పద్ధతులు పుట్టుకొచ్చాయి. ఇప్పుడు సీఐగా పోస్టింగ్ పొందాలంటే ముందుగా ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకోవాలి. ఆపై ఆ లెటర్ స్థానిక మంత్రికి పంపిస్తే.. మంత్రి ఖరారు చేసి సీపీకి పంపిస్తారు. అప్పుడే ఆ అధికారికి పోస్టింగ్ వస్తుందనే ప్రచారం జరుగుతోంది.

కరప్షన్ కింగ్‌లొస్తున్నారు..

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆరేళ్లుగా పలు పోలీసు స్టేషన్‌లలో సీఐలుగా పనిచేసి భూవివాదాలు, బెదిరింపులు, దాడులు, అవినీతికి పాల్పడి సస్పెన్షన్‌కు గురైన సీఐలు.. మళ్లీ పోస్టింగ్‌లు పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, గాడ్‌ఫాదర్లను ప్రసన్నం చేసుకుంటున్నారని సమాచారం. తాము ఎంతైనా ఇస్తామని, కానీ కోరుకున్న చోట పోస్టింగ్ ఇవ్వాలన్న షరతుతో మధ్యవర్తులతో బేరసారాలు ఆడుతున్నట్లు సమాచారం. ఇలా.. సుమారు పది మంది కరప్షన్ కింగ్‌లు కమిషనరేట్‌కు నేడో రేపో రానున్నట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్యేలు, మంత్రులు, సీపీ స్పందించి.. సిఫారసు ద్వారా కాకుండా సర్వీస్ బుక్ ఆధారంగా నిజాయితీపరులైన అధికారులను ఇన్‌స్పెక్టర్లుగా ఠాణాలకు నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేడు సీవోఈ సెట్

- హాజరు కానున్న 1264 మంది విద్యార్థులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 3: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈ సెట్ (తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 4న నిర్వహించే సీఓఈ (ప్రతిభా కళాశాలలు) సెట్ కు జిల్లా లోని స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 227 మంది విద్యార్థులు, జఫర్‌గఢ్‌లో 385 మంది, పాలకుర్తిలో 408 మంది, జనగామలో 214 మందితో మొత్తం 1264 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు సీఓఈ సెట్ జిల్లా కోఆర్డినేటర్ అలగోని నరసింహులు గౌడ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తో ఆదివారం ఉదయం పరీక్షా సమయానికి గంట ముందుగా చేరుకోవాలన్నారు. సీఓఈ సెట్‌లో మెరిట్ ప్రాతిపదికన ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 38 ప్రతిభా కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తారన్నారు. బాలబాలికలకు విడివిడిగా కళాశాలలుండగా విద్యార్థులకు ఉత్తమ బోధనతో పాటు భోజనం, వసతి, పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తారన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిక

'కాషాయ' తీర్థం పుచ్చుకున్న ఐదుగురు కౌన్సిలర్లు



నర్సంపేట నాయకులకు బీజేపీ కండువాను కప్పుతున్న కిషన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 3 : వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నర్సంపేట నియోజకవర్గ యూత్ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డితోపాటు ఐదుగురు కౌన్సిలర్లతో సహా 55 మంది కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో శనివారం హైదరాబాద్‌లో బీజేపీలో చేరారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి 13మంది కౌన్సిలర్లు రాజీనామా చేసిన విషయం విదితమే. వీరంతా హైదరాబాద్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో కలిసి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు శీలం రాంబాబు, జుర్రరాజు, మినుముల రాజు, బోడ గోల్యానాయక్, నూనావత్ కవితవీరన్న, దుగ్గొండి మండలం మహ్మదాపురం సొసైటీ వైస్ చైర్మన్ పాలడుగుల జీవన్‌తో సహా 55మందికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత ఈటల రాజేందర్ సైతం వారిలో ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమరెడ్డి, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, యువ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీష్‌గౌడ్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రాంచందర్ రెడ్డి, కోమాండ్ల సప్తగిరి, వనపర్తి మల్లయ్య పాల్గొన్నారు.

మారిన రాజకీయాలు

నర్సంపేట మునిసిపల్ చైర్ పర్సన్ గుంటి రజనిపై గతనెల 2న 13 మంది కౌన్సిలర్లు కలెక్టరేట్‌లో అవిశ్వాస తీర్మానాన్ని అందజేయగా ఇదేనెల 30న స్థానిక మునిసిపాలిటీలో ప్రత్యేక అధికారి ఆర్డీవో కృష్ణవేణి, కమిషనర్ వెంకటస్వామిల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏ ఒక్క కౌన్సిలర్ హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు అధికారులు ప్రకటించిన విషయం విదితమే. అవిశ్వాసం వీగిపోవడంతో భంగపాటుకు గురైన 13 మంది కౌన్సిలర్లు సర్వాపురంలో జరిపిన సమావేశంలో 13 మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ఈ13 మందిలో శనివారం పైన పేర్కొన్న ఐదుగురు కౌన్సిలర్లు బీజేపీ రారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన నాటి నుంచే రాజీకీయ పర్వం ఆరంభమై బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకొని ఉత్కంఠతకు దారి తీశాయి.

8 మంది కౌన్సిలర్ల రూట్ ఎటో..

బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన 13 మంది కౌన్సిలర్లలో ఐదుగురు బీజేపీలో చేరగా, మిగిలిన 8 మంది ఏ పార్టీలో చేరకుండా ఉంటారా? లేక వీరు కూడా బీజేపీలో చేరుతారా, మనసు మార్చుకొని తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతారా అన్న ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. కౌన్సిలర్లు గత రెండు మూడు రోజులుగా తర్జనభర్జన పడుతున్నారు. వీరిలో ఒకరిద్దరు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగాలని భావిస్తున్నట్లు తెలిసింది. బీఆర్‌ఎస్ పార్టీకి దూరమైన కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు ఆ పార్టీ నేత అంగీకరించే అవకాశాలు లేవు. బీజేపీ తప్ప ఇతర పార్టీల్లో చేరే అవకాశాలు వారికి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఈ 8 మంది ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని స్థానికులతోపాటు బీఆర్‌ఎస్ శ్రేణులు భావిస్తున్నారు. 13 మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇప్పటి వరకు వారి నిర్ణయంపై పెదవి విప్పలేదు.

బీఆర్‌ఎస్‌కు కోలుకోలేని దెబ్బ

నర్సంపేట బీఆర్‌ఎస్ పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోకముందే తాజాగా బీఆర్‌ఎస్‌కు ఇటీవల రాజీనామా చేసిన యూత్ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన 13 మంది కౌన్సిలర్లలో 5గురు కౌన్సిలర్లతో సహా 55 మంది తాజాగా శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న బీజేపీలో చేరడం బీఆర్‌ఎస్ పార్టీకి గట్టిదెబ్బేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆర్టీసీ కారుణ్య నియామకాలకు మోక్షం

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ● లహరి ఏసీ సెమీ స్లీపర్ బస్సులకు ప్రారంభం



కారుణ్య నియామక పత్రం అందుకుంటూ విలపిస్తున్న స్వప్న

సుబేదారి, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడం వల్లే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు మోక్షం కలిగిందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. హనుమకొండలో బస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం 70 మందికి కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగాల నియామకపత్రాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన నాలుగు లహరీ ఏసీ సెమీ స్లీపర్ బస్సులను మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యేలు, ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ.. మరికొన్ని రోజుల్లోనే మేడారం జాతర జరగనున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. 6 గ్యారంటీలను వంద శాతం అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం నియామకాలను నిర్లక్ష్యం చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన రెండునెలల్లోనే 7వేల స్టాఫ్‌నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. మరికొన్ని రోజుల్లోనే 15వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, సీపీ అంబర్ కిశోర్ ఝా, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ భాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ ఆర్ఎంలు కే.భానుకిరణ్, మాధవరావుతోపాటు డిపోల మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులను ప్రారంభించిన మంత్రి

వరంగల్-1 డిపోకే కేటాయించిన నాలుగు లహరీ ఏసీ సెమీ స్లీపర్ బస్సులను మంత్రి కొండా సురేఖ స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులను వరంగల్-1 డిపో నుంచి బెంగళూరుకు నడపనున్నారు. ప్రయాణికులు ఈ బస్సులను వినియగించుకుని సౌకర్యంగా ప్రయాణం చేయాలన్నారు.

10లోగా మేడారం ఏర్పాట్లు పూర్తి

భక్తులకు అందుబాటులోకి సదుపాయాలు : కాంట్రాక్టర్‌లకు రాష్ట్ర మంత్రి సీతక్క సూచన



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 3: మేడారం మహాజాతర ఏర్పాట్లను ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం తాడ్వాయి మండలం మేడారంలో పర్యటించిన మంత్రి పనులను పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ హన్మంతరావు, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి అధికారులతో సమీక్ష జరిపారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అందుబాటులోకి వచ్చిన సదుపాయాలు, పూర్తికాని పనులపై చర్చించారు. శాఖల వారీగా జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు అందించడం కోసం ప్రభుత్వం రూ.105 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా జాతర పనులను ఆలస్యంగా చేపట్టడం జరిగిందన్నారు. అయినప్పటికీ జాతరకు పది రోజుల ముందే సౌకర్యాలను వినియోగంలోకి తీసుకువస్తామని మంత్రి సీతక్క చెప్పారు. కొన్ని మట్టి రోడ్డు పనులు మిగిలి ఉన్నాయని, ఊరట్టం-కొండాయి రోడ్డు పనులు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయని తెలిపారు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడటం జరిగిందని, రోడ్డు పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాలేదని కొందరు కాంట్రాక్టర్లు జాతర పనులలో మొండికేసే ప్రయత్నం చేశారని, వారిని తప్పించి మరో కాంట్రాక్టర్‌తో పనులు చేయించామని తెలిపారు. పాత బిల్లులతో మేడారం పనులకు ముడిపెడితే ఊరుకునేది లేదన్నారు.

ప్లాస్టిక్ రహితంగా జాతర

ప్లాస్టిక్ రహితంగా జాతర నిర్వహించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నియంత్రణ నియమాలను పాటించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ నిర్మూలన ర్యాలీలో పాల్గొన్నారు. చీపురుతో గద్దెల ప్రధాన ద్వారం ఎదుట రోడ్లను ఊడ్చారు.

ఓర్వలేకనే ఆరోపణలు

ఎంఎస్ఎంఈ స్కీం కింద రెండు మహిళా సంఘాలకు ఫుడ్ ట్రక్కులను పంపిణీ చేశారు. ఏటూరునాగారం మండలం ఎక్కెల గ్రామంలో సమ్మక్క, సారలమ్మ మహిళా గ్రూపు, గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన రాజరాజేశ్వర మహిళా సంఘానికి ఈ ట్రక్కులను జేడీఎం కొండల్‌రావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోరుతుందని, అందులో భాగంగానే ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఓర్చుకోలేక కూలిపోతుందని తప్పుడు మాటలు మాట్లాడుతున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. టీఆర్ఎస్ పేరుతో ప్రజల్లోకి వచ్చిన కేసీఆర్ అధికార అహంకారంతో దేశ రాజకీయాలు చేస్తానని బీఆర్ఎస్‌గా పార్టీ పేరును మార్చడంతో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. ప్రియాంక గాంధీకి తెలంగాణలో తిరిగే అర్హత లేదని కేసీఆర్ బిడ్డ కవిత అనడం సరి కాదని అన్నారు. రాష్ట్రంలో ఏ మహిళను తిరగనివ్వకుండా కేసీఆర్ బిడ్డ ఒక్కతే తిరుగుతుందా..! అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించలేని దుస్థితి కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఏపీవో వసంతరావు, పలు శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మేడారంలో చీపురుతో ఊడుస్తుతున్న మంత్రి సీతక్క

కబ్జాలు, అక్రమాలు, దోపిడీపై బీఆర్ఎస్ దృష్టి

నిధుల వినియోగంలో గత ప్రభుత్వం విఫలం ● తప్పిదాలను సరిదిద్ది నగరాన్ని అభివృద్ధి చేస్తాం.. ● మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3: వరంగల్ నగరాభివృద్ధికి వివిధ విభాగాల ద్వారా మంజూరైన నిధులను కూడా వినియోగించలేని దుస్థితిలో గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాలన చేశారని రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. శనివారం హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ, కుడా పనులను సమీక్షించారు. అనంతరం వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్ తదితర విభాగాల నిధులను నగరాభివృద్ధికి వినియోగించే సోయిలేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ రూ.3 కోట్ల తూర్పు నియోజకవర్గ అభివృద్ధి నిధులను ముట్టుకోలేదని దుయ్యబట్టారు. నాటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎంత సేపు భూకబ్జాలు, ప్రజలను దోపిడీ చేయడం, భయపెట్టడం, అక్రమాలకు పాల్పడడంతోనే సరిపోయిందని ఆరోపించారు. అంతేకానీ నగరాభివృద్ధిపై చిత్తశుద్ధే కరువైందన్నారు. గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరంగల్ నగరాన్ని సమస్యల గుండంగా మార్చారని మంత్రి సురేఖ ధ్వజమెత్తారు. అభివృద్ధి పనుల పేరిట గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ నేతలు.. నిధుల కేటాయింపు ఊసే ఎత్త లేదన్నారు. ఇష్టారాజ్యంగా పనులను మంజూరు చేయడం, శంకుస్థాపనలతో ప్రజలను నమ్మించి మళ్లీ అధికారంలోకి వచ్చే కుట్రలకు ఒడిగట్టారన్నారు. కానీ ప్రజలు విశ్వసించకపోవడంతో ఓటమి పాలయ్యారని పేర్కొన్నారు. నాటి మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నగరాభివృద్ధి, సమస్యలు, పరిష్కార చర్యలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై సమీక్షలు కూడా జరపని దుస్థితంటూ సురేఖ మండిపడ్డారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

నగరాన్ని అభివృద్ధి చేస్తాం..

గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది నగరాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి సురేఖ వెల్లడించారు. ఇష్టారాజ్యంగా ప్రకటించిన పనులను సమీక్షించి వాటి ఆచరణ, నిధులు, ప్రజల అవసరాలు, నగరాభివృద్ధి ప్రాధాన్య క్రమంలో గుర్తించి పనులు చేపడతామన్నారు. వరంగల్‌ను మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. జీడబ్ల్యూఎంసీ, కుడా పనులతో నగర రూపురేఖలను మారుస్తామన్నారు. నగరాన్ని టూరిస్ట్ హబ్‌గా మార్చడం ద్వారా ఆదాయం, ఉద్యోగావకాశాలు నెలకొంటాయన్నారు. అలాగే నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ తప్పిదాలు నగరానికి శాపంగా పరిణమించాయన్నారు. మురికివాడలోని ప్రజల సమస్యలు పరిష్కరించే చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. అమరవీరులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలను కేటాయించాలని కలెక్టర్లకు చెప్పినట్లు వివరించారు. వరంగల్‌లో ఇంద్రవెల్లి తరహాలో అమరులను స్మరించే సభను నిర్వహించే ఆలోచనతో ఉన్నట్లు సురేఖ వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వరంగల్‌లోని బెస్ టెర్మినల్, స్టేడియం ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం రేవంత్‌రెడ్డిని వరంగల్‌కు తీసుకురానున్నట్లు మంత్రి సురేఖ చెప్పారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్రం

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్



హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించిందని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం టీజేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విభజన హామీలు - కేంద్రప్రభుత్వం వివక్షత - దగాపడ్డ వరంగల్ ' అనే అంశంపై నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

ఓరుగల్లు ఒక చారిత్రాత్మకమై పోరుగల్లు అని, చాకలి ఐలమ్మ పోరాట వారసత్వం, బందగీ, కాళోజీ, ఆచార్య జయశంకర్ వరకు కొనసాగిన పోరాట ఘనత ఈ ప్రాంతానిదని అన్నారు. తెలంగాణ ప్రాంతం సుదీర్ఘకాలంగా పాలకుల అణచివేతకు గురైందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది త్యాగాలను తన పొత్తిళ్లల్లో నింపుకొని ఎంతో మంది త్యాగనిరతితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కోదండరామ్ అన్నారు. వేలాది మంది పోరాటంతో సాధించుకున్న తెలంగాణను దొరల గడీలకు పరిమితమైతే ఇటీవల జరిగిన ఎన్నికల్లో దొరల గడీల పాలనను ఓటు అనే వజ్రాయుధం ద్వారా పాలకుల గడీలను బద్ధలు కొట్టి ప్రజాస్వామ్య పాలనను ప్రజలు కోరుకున్నారని అన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తక్షణమే ఏర్పాటు చేయాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని వెంటనే ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల విభజనను పూర్తి చేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కు పంపాలని, పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర స్థాయి సంస్థలు, ఆస్తులను విభజించాలని, కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా తేల్చాలని, రాష్ట్రంలో హార్టికల్చర్ యూనివర్సిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానించారు.

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చిల్లా రాజేంద్రప్రసాద్ అధ్యక్షత నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మరాజన్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ నాయకులు మన్నె బాబురావు, ప్రజాసంఘాల నాయకులు రత్నం కిరణ్, చాప బాబుదొర, జహంగీర్, డోలి సత్యనారా యణ, బొనగాని రవీందర్, గుండు రాంచందర్, వెలిశాల రాజేష్, మనోజ్‌కుమార్, బండి మొగిలి, దుర్గం సారయ్య, అంకేశ్వరపు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలను పునరుద్ధరించాలి



కాళోజీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పౌర స్పందన వేదిక నాయకులు

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 3: పుస్తకాలు మెదడుకు పదును పెడుతాయన్న మేధావుల నినాదాలకు సార్థకత కల్పించకుండా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పౌరస్పందన వేదిక జిల్లా అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు యాదవ్, ప్రధాన కార్యదర్శి నల్లెల్ల రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ కాళోజీ సెంటర్‌లోని ప్రజాకవి కాళోజీ నారాయణరావు విగ్రహం ఎదుట శనివారం వారు నిరసన ప్రదర్శన చేపట్టారు. వరంగల్ నగర పరిసర ప్రాంత మండలాల్లోని గ్రంథాలయాలు రెండేళ్లుగా మూతపడి శిథిలావస్థకు చేరి నిర్వహణ అధ్వాన్నంగా మారిన అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు.

ఈ సందర్భంగా పౌరస్పందన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు మాట్లాడుతూ.. ప్రజా కవులుగా పేరొందిన కాళోజీ సోదరుల జన్మస్థలమైన మడికొండ గ్రామంలో 30 ఏళ్ల కిందట ఏర్పడిన గ్రంథాలయం రెండేళ్లుగా మూతపడి గోడలు కూలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. గీసుగొండ మండల కేంద్ర గ్రంథాలయం, వరంగల్‌లోని రామన్నపేట గ్రంథాలయం, హనుమకొండలోని జిల్లా గ్రంథాలయ సంస్థలకు నిర్వహణ కొరవడిందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ సంస్థ మేలుకొని శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలన్నింటిని పునరుద్ధరించి గ్రామాల్లోని విద్యార్థులు పోటీ పరీక్షల మేథో వికాసానికి తోడ్పాటు నందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముగిసిన దరఖాస్తుల ఘట్టం



వరంగల్ పార్లమెంట్ స్థానం కోసం దరఖాస్తు అందచేస్తున్న పిడమర్తి రవి

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3: రానున్న పార్లమెంట్ ఎన్నికల క్రమంలో ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఘట్టం ముగిసింది. నాలుగు రోజులుగా హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తుల స్వీకరణ క్రమంలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్ ఆశావహులు దరఖాస్తులను సమర్పించారు. శనివారం చివరి రోజు కావడంతో ఈ రెండు స్థానాల నుంచి ఆశావహులు డబుల్ డిజిట్‌లో ఉండడంతో దరఖాస్తుల పరంపర కొనసాగింది. ఇప్పటిప వరంగల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకులతో పాటు ప్రభుత్వ అధికారులు కూడా రాజకీయ ఆరంగ్రేటం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఢిల్లీకి ఫైనల్ లిస్ట్

దరఖాస్తుల ముగింపుతో ఈనెల 8లోగానే స్క్రీనింగ్ పూర్తి చేసి ముగ్గురేసి అభ్యర్థులతో కూడిన జాబితాను టీపీసీసీ ఢిల్లీకి పంపనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం అధిష్ఠానం ఎంపిక ప్రకియను చేపట్టి 15 నుంచి 18వ తేదీలోగానే అభ్యర్థుల ఎంపిక పూర్తి ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

జనగామ కోర్టును సందర్శించిన హైకోర్టు జడ్జి


హైకోర్టు జడ్జికి మెమొంటో అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

జనగామ టౌన్, ఫిబ్రవరి 3: జిల్లా పర్యటనలో భాగంగా హైకోర్టు జస్టిస్ జె.శ్రీనివాసరావు శనివారం జిల్లా కోర్టును సందర్శించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సమస్యలను జస్టిస్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కోర్టులో మహిళా న్యాయవాదులకు ప్రత్యేక హాల్ కేటాయించాలని, కక్షదారుల కోసం క్యాంటీన్, జిరాక్స్ మెషీన్ ఏర్పాటు చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరారు. అడిషనల్ జిల్లా కోర్టు, రెండు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ కేసులు జనగామలో విచారణ జరిగేలా చూడాలని, సబ్‌జైలును చంపక్‌హిల్స్‌కు తరలించి ఆ ప్రాంతంలో కొత్త జిల్లా కోర్టును నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి రవీంద్రశర్మ, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్లి శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, ఉప్పలయ్య, జమాల్ షరీఫ్, రవి, రాజశేఖర్, బిర్రు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో కోర్టు సేవలు ప్రారంభించాలంటూ వినతిపత్రం..

స్టేషన్‌ఘన్‌పూర్: గత ప్రభుత్వం స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌కు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టును మంజూరు చేసినా సేవలు అందుబాటులోకి రాలేదని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతూ స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి గద్దె అనిల్ శనివారం జనగామకు వచ్చిన హైకోర్టు జడ్జి శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని అనిల్ తెలిపారు.

టీపీటీఎఫ్ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మేకల కళింగరాజు తదితరులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 3: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. శనివారం జనగామ మండలం పసరమడ్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మేకల కళింగరాజు ముఖ్య అతిథిగా హాజరై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలు, సామాజిక సమస్యల పట్ల టీపీటీఎఫ్ పోరాటం, సామాజిక దృక్పథం అభినందనీయమన్నారు. ఈ నెల 11, 12 తేదీలలో ఖమ్మం లో జరిగే రాష్ట్ర విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జె.రాజేందర్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు వీరాంజని, శ్రీనివాసరావు, జిల్లా బాధ్యులు సునంద, సత్యనారాయణరెడ్డి, రాజారెడ్డి, కె.రాజయ్య, వసంత, వృకోధర్, రమేష్, రాజ్యలక్ష్మి, పర్వ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 3: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం సెషన్‌లో జనరల్, ఒకేషనల్ విద్యార్థులతో కలిపి 906 మందికి గాను 833 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 842 మంది విద్యార్థులకు 808 మంది హాజరయ్యారు. మొత్తం 1748 మంది విద్యార్థులకు 1641 మంది (93.87 శాతం) విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో భైరి శ్రీనివాస్ తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను డీఐఈవో సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతిభను వెలికితీసేందుకే ప్రజ్ఞోత్సవం

జిల్లా విద్యాశాఖాధికారి రాము

పాఠశాలల్లో ఘనంగా వేడుకలు


లింగాలఘణపురం ప్రజ్ఞోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడుతున్న డీఈవో రాము

లింగాలఘణపురం, ఫిబ్రవరి 3: ప్రాథమికస్థాయి విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రజ్ఞోత్సవ కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి రాము అన్నారు. శనివారం లింగాలఘణపురంలో నిర్వహించిన మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్ ప్రజ్ఞోత్సవ కార్యక్రమానికి నోడల్ అధికారి విష్ణుమూర్తి అధ్యక్షత వహించగా డీఈవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో విద్యార్థిలో ఒక్కో రకమైన ప్రతిభ అంతర్లీనంగా ఉంటుందని, దానిని గుర్తించి వెలికితీయగలిగే ప్రయత్నంలో ప్రతిభ వెలుగొందడమేకాకుండా పోటీ తత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. ఇందులో మండలంలోని 40 ప్రాథమిక పాఠశాలలకు చెందిన 170 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాథ్స్ క్విజ్, డ్రాయింగ్, పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్, రీడింగ్, తెలుగు రైటింగ్ స్పెల్‌విజార్డ్, సోలో సాంగ్స్, గ్రూప్ డ్యాన్స్, స్కిట్లు తదితర అంశాలపై కాంపిటీషన్స్‌ను నిర్వహించగా విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను చాటారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు డీఈవో రాము బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, డీసీఈబీ చైర్మన్ చంద్రభాను, కార్యదర్శి రామరాజు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జనగామ కల్చరల్: మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) ప్రజ్ఞోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. శనివారం జనగామ మండలం పసరమడ్ల ఎంపీయూపీఎస్‌లో నోడల్ అధికారి వి.రాజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ మేకల కళింగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 11 అంశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో స్టోరీ టెల్లింగ్, పఠనం, లేఖనం, చిత్రలేఖనం, గ్రూప్ డ్యాన్స్, స్పెల్ విజర్డ్, గణితం క్విజ్, స్కిట్, పాటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీఈఓ కె.రాము విశిష్ట అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో ఎంఈవో భగవాన్, ఏఎంవో శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ సంపత్ కుమార్, డీసీఈబీ సెక్రటరీ చంద్రభాను, రామరాజు, దూడల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శనివారం ప్రజ్ఞోత్సవ వేడుకలను నిర్వహించారు. ఎంఎన్‌వో గ్రేస్ కేజియారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని కృత్యాలు, కథలు చెప్పడం లాంటి వివిధ రూపకాలతో అలరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈవో రాము విద్యార్థులను అభినందించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రజియాబేగం, అందె సుధాకర్, అనిల్, రమేశ్, సంధ్యారాణి, ప్రవీణ్, సహోదరరెడ్డి, దోర్గం ప్రభాకర్ , సీఆర్పీలు బాలాజీ, జ్ఞానానందం, అనిల్ పాల్గొన్నారు.

దేవరుప్పుల: మండలస్థాయి మేలిక భాషా గణిత సామర్థ్యాల (ఎఫ్ఎల్ఎన్)ప్రజ్ఞోత్సవం పోటీలు మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎంపీపీ బస్వ సావిత్రి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవత్సరం పాటు నేర్పించిన పాఠాలను చదవటం, రాయటం, కథలపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సీహెచ్. ఉపేందర్, ఎంపీటీసీ రేణుక, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శ్రీలత, రాజారెడ్డి, కాంప్లెక్స్ కార్యదర్శులు అంబటి అంజయ్య, మర్యాల రమేష్, దేవరుప్పుల హైస్కూల్ హెడ్మాస్టర్ రాజేంద్రప్రసాద్, విషయ నిపుణులు ప్రభాకర్, బాలనర్సయ్య, కిరణ్, హరిప్రసాద్ పాల్గొనగా, జడ్జీలుగా సుకుమారి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: విద్యార్థులందరికీ అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేలా ఉపాధ్యాయుల బోధనా విధానం ఉండాలని మండల నోడల్ అధికారి గోవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నపెండ్యాల ఎస్సీబీసీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ప్రజ్ఞోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి మండలంలోని 26 ప్రాథమిక పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. స్టోరీ టెల్లింగ్, రీడింగ్, రైటింగ్, డ్రాయింగ్, గ్రూప్ డ్యాన్స్ తదితర అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు షీల్డ్‌తో పాటు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కేతిరి నర్సింహారెడ్డి, సంపత్, దారం శ్రీనివాస్, రమేష్, అంద్రు శ్రీదేవి రెడ్డి, కళ్యాణి, శోభారాణి, ఫాతిమారాణి, రాజేందర్, వాణిరాణి, కమల్, కవిత, జాన్‌సుందర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రాజయ్యను కాంగ్రెస్‌లోకి రానివ్వం

పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్‌చందర్ రెడ్డి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌చందర్ రెడ్డి తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 3: మాజీ ఎమ్మెల్యే రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి రానిచ్చే ప్రసక్తే లేదని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్ చందర్ రెడ్డి, రఘునాథపల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మి స్పష్టం చేశారు. శనివారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆయనకు టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేను చేస్తే పార్టీని, కార్యకర్తలను మోసం చేసి బీఆర్ఎస్‌లోకి వెళ్లాడని, అలాంటి వ్యక్తిని మళ్లీ ఎలా రానిస్తామని ప్రశ్నించారు. గత ఆరు ఏళ్లుగా నియోజకవర్గంలో పార్టీని ఎంతో బలోపేతం చేశామని, ఇపుడు రాజయ్య పార్టీలోకి వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు తరిమికొడుతారని హెచ్చరించారు. ఇందిర నాయకత్వంలో పార్టీ ఘన్‌పూర్‌లో బలంగా ఉందని, ఎవరు వచ్చినా ఇక్కడ చేసేది ఏమీలేదని అన్నారు. దళిత బంధు పథకం విషయంలో అమాయక దళితుల వద్ద నుంచి లక్షలాది రూపాయలు కమీషన్లు తీసుకున్న రాజయ్య గ్రామాల్లోకి వస్తే నిలదీస్తారని, వారి నుంచి తప్పించుకోవడానికే అధికార పార్టీలోకి రావాలని చూస్తున్నాడని విమర్శించారు. ఈ విషయం త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డికి కూడా తెలియజేస్తామని, రాజయ్య రాసలీలలు, అవినీతి బాగోతాలు సీఎంకు వివరిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాగరబోయిన శ్రీరాములు, శిరీష్ రెడ్డి, గడ్డమీది సురేష్, కోరుకొప్పుల మహేందర్‌గౌడ్, మంచాల ఎల్లయ్య, అన్నెబోయిన బిక్షపతి, మోడెం రమేష్, గాదె రమేష్, మహేందర్ రెడ్డి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు ప్రయోజనం

టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర


పార్టీలో చేరిన మహిళలతో సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ పాలనలోనే ప్రతీ నిరుపేదకు సంక్షేమ పథకాలు అందుతాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీటీసీ గట్టు రమాదేవి-రమేష్ ఆధ్వర్యంలో 20మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఇందిర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో పూర్తి చేస్తామని అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తుందని, త్వరలోనే అమలు పరుస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దయాకర్, పార్టీ పట్టణాధ్యక్షుడు నీల శ్రీధర్, చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, సింగపురం నాగయ్య, రాజు, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని

పెంపొందించుకోవాలి

జిల్లా విద్యాశాఖాధికారి రాము

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 3: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలని జనగామ డీఈఓ కె.రాము అన్నారు. జనగామ జిల్లా కేంద్రం లోని ఏకశిల బీఈడీ కళాశాలలో శనివారం జిల్లా స్థాయి చెకుముకి సంబరాలకు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మర్రెడ్డి అధ్యక్షత వహించగా డీఈఓ రాము ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో సైన్స్ ప్రావీణ్యతను పెంచడానికి, సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడానికి, సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి, శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలనా శక్తిని రేకెత్తించడానికి సైన్స్ సంబురాలు దోహదపడతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వ సమగ్ర శిక్ష విభాగం కూడా చేయూతనిచ్చి సంబురాలను ప్రోత్సహిస్తుందన్నారు. అన్నిప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాటశాలల్లో 8,9,10 తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయి, మండల స్థాయి పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాలు పెంచడానికి అనేక కార్యక్రమాలు చేస్తున్నామని, దానిలో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష ఒకటన్నారు. ఫిబ్రవరి 9,10,11 తేదీలలో రాష్ట్ర స్థాయి పోటీలకు జనగామ జిల్లా వేదిక కానుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, డీసీఈబీ సెక్రటరీ చంద్రభాను, జిల్లా సైన్స్ అధికారి రఘునందన్‌రెడ్డి, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి భానోతు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో

గురుకుల విద్యార్థికి ప్రథమ బహుమతి


సాయి మన్విత

కొడకండ్ల, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని టీఎస్ఆర్ఎస్ గురుకుల పాఠశాల విద్యార్థిని సాయి మన్విత జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకుందని ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ తెలిపారు. జిల్లా కేంద్రంలో తెలంగాణా సోషల్‌స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని సాయి మన్విత ప్రథమ బహుమతి, 3 వేల నగదు బహుమతి పొందిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఉపాధ్యాయులు సాయి మన్వితను అభినందించారు.

రాష్ట్రస్థాయి చెకుముకి

పోటీలకు కళ్లెం విద్యార్థిని


నవ్యకు బహుమతి అందజేస్తున్న అధికారులు

లింగాలఘణపురం, ఫిబ్రవరి3: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు లింగాలఘణపురం మండలం కళ్లెం జడ్పీహైస్కూల్‌కు చెందిన బోయిని నవ్య ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పాశికంటి యాదగిరి తెలిపారు. ఇటీవల మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో పాటు శనివారం జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో కూడా తన సత్తాను నిరూపించిన నవ్యను హెచ్‌ఎం యాదగిరి, సైన్స్ ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా అశోక్



లింగాలఘణపురం, ఫిబ్రవరి3: నెహ్రూ యువకేంద్ర సంఘటన్ వరంగల్ అడ్వయిజర్ కమిటీ సభ్యుడిగా జనగామ జిల్లా బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షులు లింగాలఘణపురం మండలం చీటూరుకు చెందిన పసుల అశోక్‌ను నియమిస్తూ కేంద్ర యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖా మంత్రివర్యులు అనురాగ్ సింగ్‌ఠాకూర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈసందర్భంగా తన నియామకానికి సహకరించిన బీజేపీ నేతలు దశమంత్‌రెడ్డి, ఊడ్గుల రమేశ్, సౌడ రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టీఆర్‌వీకేఎస్ డివిజన్

ప్రధానకార్యదర్శిగా మహేందర్



స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 3: రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం డివిజన్ ప్రధానకార్యదర్శిగా పెరుమాళ్ల మహేందర్ ఎంపికయ్యారు. శనివారం డివిజన్ కేంద్రంలోని జరిగిన కార్మికుల సమావేశంలో మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తానని అన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- నమూనా జడ్పీ సమావేశంలో కస్తూర్బా బాలికల చర్చ


కస్తూర్బా విద్యాలయంలో 'నమూనా జడ్పీ సమావేశం' నిర్వహిస్తున్న విద్యార్థినులు

జఫర్‌గడ్, ఫిబ్రవరి 3: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని.. పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేందుకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని చర్చా వేదిక ద్వారా కస్తూర్బా బాలికలు కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణ, మేడారం జాతరలో భక్తులు ఎదుర్కొనే ఇబ్బందులు, వాటి నివారణపై బాలికలు శనివారం జఫర్‌గడ్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో 'నమూనా జడ్పీ సమావేశం' నిర్వహించి చర్చించారు. జడ్పీ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులుగా బాలికలు ముస్తాబై సమావేశ హాలులో ప్రధానంగా పర్యావరణం, ప్లాస్టిక్ వాడకం, మేడారం జాతరలో కాలుష్యం వంటి అంశాలపై చర్చా వేదికలో చర్చించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినా.. వినియోగం పెరిగిపోతోందని, తద్వారా పర్యావరణం దెబ్బతింటోందన్నారు. నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పచ్చదనం, పరిశుభ్రతను అందరూ పాటించాలన్నారు. వాతావరణంలో కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. అలాగే రెండేళ్లకోసారి నిర్వహించే మేడారం మహాజాతరకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కోట్లాది మంది భక్తులు వస్తుంటారని.. జాతర ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలు కాలుష్యం చెందకుండా, పర్యావరణ పరిరక్షణకు అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు తీర్చుకునేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జాతర నిర్వహణ, అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. ఇంకా పలు అంశాలపై చర్చించి సమీక్షించారు. కాగా, విద్యార్థినులు ప్రజా ప్రతినిధులు, అధికారులుగా వ్యవహరించి ఆయా సమస్యలపై విషయ పరిజ్ఞానంతో చర్చించిన తీరు ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ స్వప్న మాట్లాడుతూ ఇలాంటి చర్చా వేదిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ప్రజా సమస్యలపై అవగాహన పెరుగుతుందన్నారు. బాలికలు చదువు, క్రీడలతో పాటు సామాజిక అంశాలపై దృష్టి సారించాలన్నారు.

ఘనంగా యశస్వినిరెడ్డి జన్మదినం


పాలకుర్తిలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి, పక్కన చాకలి ఐలమ్మ మనుమరాలు సంధ్య

పాలకుర్తి, ఫిబ్రవరి 3: పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గ కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత శ్రేణి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి జన్మదినం సందర్భంగా. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సమగ్రాభివృద్ధిలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా తాగు, సాగునీటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పాలకుర్తిని అభివృద్ధిలో ముందుంచుతామన్నారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో వెయ్యిమందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ సర్పంచులు కొంరోజు సోమన్న, మాచెర్ల పుల్లయ్య, జల్లం కుమారస్వామి, గోనె కార్తిక్‌రెడ్డి, ప్రభకర్, సలేంద్ర సంపత్, పులి భాస్కర్, గోనె సోమయ్య, బిజ్జాల సోమన్న, పెదగాని సోమయ్య, గంగు కృష్ణమూర్తి, తిరుపతిరెడ్డి, బిర్రు సోమేశ్వర్, మాజీ ఉపసర్పంచు తరాల చంద్రబాబు, చిలువేరు కృష్ణమూర్తి, బలరాజు, పసులాది యాకస్వామి, పోగు శ్రీనివాస్, ముస్కు చంద్రబాబు, రమేష్ పాల్గొన్నారు.

దేవరుప్పుల: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. దేవరుప్పుల చౌరస్తాలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. సీతారాంపురంలోని అనాథ వృద్ధాశ్రమంలో కేక్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు సురేష్ బాబు, తోటకూరి కృష్ణపాండు, కాడబోయిన గణేష్, రెడ్డిరాజుల రమేష్, నాగరాజు, యాకస్వామి, ఓడపెల్లి రవీందర్, పరీదుల భాస్కర్, సురంజన్‌రెడ్డి, సైదులు, మహేందర్, సోమనర్సయ్య, భూక్యా సజ్జన్, ఉప్పుల అనిల్, గొడిషాల శ్రీనివాస్, చింత నిఖిల్, సురేష్, భాస్కర్, బట్ట యాదగిరి బట్ట అబ్బయ్య, కొంగరి ఉమేష్ పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డి.సురేష్ నాయక్ ఆధ్వర్యంలో పాలకుర్తి ఎంఎల్యే యశస్విని రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొడకండ్ల బస్టాండ్ సెంటర్లో కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, వనం మోహన్, సోమనర్సయ్య, అమరేందర్ రెడ్డి, సునీల్ రెడ్డి, భిక్షపతి, వలభోజు రమేశ్, ఖలీం, వంశీ, మనోహర్, రవీందర్, శ్రీవర్ధ, కృష్ణ, వెంకన్న వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా బుగులు వెంకటేశ్వరుడి వార కల్యాణం

- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు


కల్యాణానికి హాజరైన భక్తులు

చిలుపూర్, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణం కన్నుల పండువగా జరిగింది. శనివారం ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య వెంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణం జరిపించారు. ప్రత్యేక రుసుము చెల్లించి కల్యాణంలో కూర్చున్న దంపతులకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కుందన్ సింగ్, ఓటి సింగ్, జోస్నదేవి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, స్వామివారి నిత్యసేవకులు, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు - కిరణ్మయి దంపతులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి - శంకరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


భాస్కర్ (ఫైల్)

చిలుపూర్, ఫిబ్రవరి 3: మండలంలోని వెంకటాద్రిపేట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీగలతండా పరిధిలోని వాచ్యాతండాకు చెందిన భానోత్ భాస్కర్ (25) అనే యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... భాస్కర్ సోదరి స్వరూపతో కలిసి ద్విచక్ర వాహనంపై నర్మెటకు వెళ్తుండగా కొమ్ముగుట్ట నుంచి చిన్నపెండ్యాల వైపు వెళ్తున్న కారు వెంకటాద్రిపేట సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే చనిపోగా, స్వరూపకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


విజేతలకు షీల్డ్ అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం వెంకిర్యాలలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువకులు ఒకతాటి మీదకు వచ్చేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లకు బహుమతులను అందించారు.

కేంద్ర మంత్రికి వినతిపత్రం

రఘునాథపల్లి, ఫిబ్రవరి 3: హైదరాబాద్-భూపాలపట్నం (163) జాతీయ రహదారిపై మండల కేంద్రంలోని విద్యుత్తు సబ్-స్టేషన్ ఎదురుగా యూ-టర్న్ ఏర్పాటు చేయాలని కోరుతూ మండల జేఏసీ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని జేఏసీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, పడకంటి రవిందర్, బెల్దె నాగన్న, ద్యావర రాజు, వల్లాల వెంకటేష్, పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

జనగామ టౌన్, ఫిబ్రవరి 3: ఫిబ్రవరి 16న కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల సాధన కోసం తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం డీపీవో రంగాచారికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనంగా సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారోజు రామచంద్రం, బసవ రామచంద్రం, వెంకటరెడ్డి, గుర్రం లాజర్, జి.ఉప్పలయ్య పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

పాలకుర్తి, ఫిబ్రవరి 3: మండలంలోని శాతాపురం క్రాస్ రోడ్డు వద్ద శనివారం 4 వేల కిలోల నల్లబెల్లం, 100 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబాను టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా నుంచి మహబూబాబాద్ జిల్లా కేసముద్రంనకు వాహనంలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి నిందితుడు రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వివరించారు.